ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
మంగళవారం 18 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (మంగళవారం సాయంత్రం)
సహర్ 5:02 (బుధవారం ఉదయం)



విద్యార్థులకు 'కార్పొరేట్' గాలం

- ప్రారంభమైన ఇంటర్ అడ్మిషన్ల దందా
- ముందస్తు ప్రవేశాలకు ఫోన్ కాల్స్
- ఆఫర్లు ప్రకటిస్తున్న పీఆర్‌వోలు
- ఎస్సెస్సీ పరీక్షలు పూర్తికాక ముందే తల్లిదండ్రులతో ఒప్పందాలు
- జిల్లాలో 11,855 మంది విద్యార్థులు

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ముగియక ముందే కార్పొరేట్ దందా మొదలైంది. హలో సర్...మీ అమ్మాయి పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తుందని తెలుసుకున్నాం...మీ అమ్మా యి బాగా చదువుతుందని ముందు నుంచే విన్నాం.. మా కళాశాలలో నాణ్యమైన బోధన ఉంటుంది. మంచి మార్కులు వచ్చే విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇస్తాం...ఒకసారి మా కాలేజీకి వచ్చి చూడండి...కేవలం ముందస్తు అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు అంటూ ప్రైవేటు, కార్పొరేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌కాల్స్ చేస్తూ అడ్మిషన్ల వల విసురుతున్నారు. జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న అడ్మిషన్ల ప్రచారం అంతా ఇంతా కాదు. ఆయా కళాశాలల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ (పీఆర్‌వోలు) అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాలతో పాటు పలు మండల కేంద్రా లు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల ఇళ్లకువెళ్లి అడ్మిషన్లు చేయిస్తున్నారు. ముందుగా అడ్మిషన్ బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ ఉంటుందని చెబుతున్నారు. ముందుగా సీటు రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచ్‌లో సీటు దొరకదని బెదరకొడుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, విజయవాడ, గుంటూ రు వంటి పట్టణాల్లో పేరు మోసిన కార్పొరేట్ కాలేజీల్లో ముందస్తు అడిష్మన్లు పొందుతున్నారు.

● ఎస్సెస్సీ పరీక్షలు కాక ముందే..

పదోతరగతి వార్షిక పరీక్షలు పూర్తి కాకముందే కళాశాలల్లో ప్రవేశాలకు ముందస్తు బుకింగ్‌లు జరుగుతున్నాయి. జిల్లాలో ఈనెల21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు 11,855మంది రెగ్యులర్ విద్యా ర్థులు, 285మంది ప్రైవేటు విద్యార్థులు హాజరవుతున్నారు. కాగా విద్యా ర్థుల అడ్రస్‌లు, ఫోన్‌నంబర్లు కార్పొరేట్ కళాశాలల యాజ మాన్యాలు, కన్సల్టెన్సీలు, పీఆర్‌వోలకు చేరాయి. ముందస్తుగా బుక్ చేస్తే పీఆర్‌వోలకు కమీషన్లు లభిస్తుండడంతో వారు తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఒక్కో విద్యార్థిపై పీఆర్‌వోకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు కమీషన్ అందుతున్నట్లు తెలుస్తోంది. ఇంటర్ అడ్మిషన్లకు ఎల్ఐసీ ఏజెంట్లు, ప్రభు త్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, ఆర్ఎంపీలను సైతం రంగంలోకి దింపి ఒక్కో విద్యార్థితో యాజమాన్యం నిర్ణయించిన ఫీజు కట్టిస్తే పదిశాతం డబ్బులు ముట్టజెప్పేందుకు పీఆర్‌ఓలతో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

● అప్రమత్తతే ప్రధానం..

తల్లిదండ్రులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించే ముందు పిల్లల అభిప్రాయాలతో పాటు సదరు కళాశాలల్లో విద్యా బోధన, వసతులు, అనుమతుల గురించి తెలుసుకోవాలని హెచ్చరిస్తున్నారు. తమ విద్యా వ్యాపారం కోసం నిత్యం విద్యార్థులను పుస్తకమే ప్రపంచంగా మార్చే కళాశాలలు కొన్ని ఉన్నాయని, అలాంటి వాటిలో చేర్పిస్తే విద్యార్థులు ఒత్తిడికి గురయి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయని సూచిస్తున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయిస్తున్న ఆయా కళాశాలల పీఆర్‌వోలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టినట్లయితే చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు కళాశాలల్లో ముందస్తుగా అడ్మిషన్లు చేపడితే మా దృష్టికి తీసుకు రావాలి. ఇంటర్ బోర్డు నుంచి అనుమతి పొందిన తర్వాతే అడ్మిషన్లు చేపట్టాలి. ముందస్తు అడ్మిషన్లపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అసత్య ప్రచారాలను నమ్మవద్దు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.



-బొప్పరాతి నారాయణ, ఇంటర్ విద్యాధికారి

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ధరణి దరఖాస్తుల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను ఈనెల చివరి వరకు పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి ధరణి దరఖాస్తునైనా పది రోజుల లోపు పరిష్కరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్‌డీఓలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో సర్వే నంబర్ 413లో ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా చేపడుతున్న భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని జగిత్యాల మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన మున్సిపాలిటీ అధికారులు అనుమతిని రద్దు చేయగా, దానిని సవాలు చేస్తూ ఇంటిని నిర్మిస్తున్న వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. కోర్టు కూడా నిర్మాణం నిలిపివేయాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయినప్పటికీ కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి చేపడుతున్న నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో శ్రీనివాస్ కోరారు.

తైబజార్ వసూళ్లు రద్దు చేయాలని ఎమ్మెల్సీ లేఖ

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ పరిధిలోని రైతులు, రైతు కూలీలు, తోపుడు బండ్ల చిరు వ్యాపారులపై ఆర్థిక భారం తొలగించేందుకు తైబజార్ వసూళ్ల రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. గతంలో మున్సిపాలిటీలకు తైబజార్ చిట్టీని ఆదాయ వనరుగా పరిగణించి వసూలు చేసేవారన్నారు. అనంతరం మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వనరులు సమకూర్చడంతో పాటు ఇతర మార్గాల ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరే మార్గాలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో చిరు వ్యాపారులపై తైబజార్ చిట్టీ వసూలుతో ఆర్థిక భారం పడకూడదనే సంకల్పంతో మూడు దశాబ్దాల క్రితం జగిత్యాల పట్టణ మున్సిపల్ పరిధిలో తైబజార్‌ను రద్దు చేశామన్నారు. రాయికల్‌లోని చిరు వ్యాపారులు ఆర్థిక భరోసా కల్పించేందుకు తై బజార్ వసూళ్లను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం ధర్మపురి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు నాయకులు మున్సిపల్ గేటు ఎదుట ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వ ర్యంలో పోలీసులు చేరుకుని నచ్చ జెప్పి ఆందోళన విరమింపచేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, బీఆర్ఎస్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, మాజీ కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరు వేణుగోపాల్, సయ్యద్ యూనస్, గుర్రాల సుధాకర్, నాయకులు పురాణపు సాంబమూర్తి, అనంతుల లక్ష్మణ్, సంగి శ్రీనివాస్, చీర్నేని నర్సయ్య, మామిడి శ్రీనివాస్ ఉన్నారు.

రాయితీ యంత్రాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తోందని, దీనికోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. రాయితీ యంత్రాల కొనుగో లుకు జిల్లాకు రూ.78.79లక్షల నిధులు మంజూరు అయ్యా యన్నారు. మార్చి 25లోగా లబ్ధిదారులను ఎంపికచేసి వారికి పరికరాలు అందిం చేందుకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సన్న, చిన్నకారు మహిళా రైతులకు 40శాతం, ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం రాయితీ ఉంటుందన్నారు. అన్ని మండల వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

● జిల్లాకు చెందిన ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేయుటకు మండలాల వారీగా అవసరమైన సామగ్రి సరఫరా చేయుటకు ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. ఆసక్తిగల యజమానులు జిల్లా వ్యవసా య అధికారి కార్యాలయంలో మంగళవారం నుంచి 20వతేదీ సాయం త్రం నాలుగు గంటల లోపు కొటేషన్లు అందజేయాలని కోరారు.

చెరువు శిఖం భూములను కాపాడాలి

జగిత్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నమిలి కొండ గ్రామంలోని జాఫర్‌ఖాన్ చెరువు శిఖంభూములను భూక బ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సాగునీటి సంఘం మాజీ వైస్ చైర్మన్ ల్యాతాకుల లక్ష్మారెడ్డి ఆముదాల లింగారెడ్డి, బాబురెడ్డి, ఆనందం, వెంకటాచారిలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ భూ ఆక్రమణలను గుర్తించి చెరువు యొక్క హద్దులు గుర్తించాలని డిమాండ్ చేశారు. నమిలికొండ, గోపాల్రావుపేట గ్రామాల ఆయకట్టులో గల చెరువులో అక్రమంగా బోర్లు వేసి షెడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగి త్యాల పట్టణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రూపొందించిన పంచాంగాన్ని ఎమ్మెల్యే ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో మేడిపెల్లి శ్రీనివాస్‌శర్మ ఉన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీభక్త మార్కండేయ దేవాలయం, పద్మ శాలి సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవ ఆహ్వాన కర పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి నవమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

జగిత్యాల అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలతో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి విమర్శిం చారు. అంగన్‌వాడీల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయాలనే ఆలోచన చేస్తోందన్నారు. బీజేపీ నూతన జాతీయ విద్యా విధాన చట్టం తెచ్చిందని ఇది అమలైతే ఐసీడీఎస్ స్వతంత్రంగా ఉండదన్నారు. ఐసీడీఎస్‌లో సమూల మార్పులు చోటు చేసుకుని మూత పడే పరిస్థితి వస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కటుకం రజిత, జిల్లా కార్యదర్శి గుగ్గిల్ల స్వప్న జయప్రద, సరిత, మణెమ్మ, గంగాజమున ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జలగంటకు వేళాయె..

- వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని నిపుణుల సూచన 6
- గతంలో పాఠశాలల్లో అమలు
- కరోనా తర్వాత ఆచరణకు నోచుకోని వైనం
- విద్యార్థుల్లో నీరు తగ్గితే ప్రమాదమని వైద్యుల హెచ్చరిక

ఘనంగా లక్ష్మీ నృసింహుడి ఉత్తర దిగ్యాత్ర 7

- ఉసిరిక వాగు వద్ద పూజలు అందుకున్న నారసింహుడు

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● బీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఒంటిపూట బడులపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటిపూట బడుల ఉత్తర్వులను ధిక్కరిస్తూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు రెండు పూటలు బడులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై డీఈవోను కలిసి వివరించామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవోలు పాఠశాలలను సందర్శించి తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు రాజు, జోనల్ ఇంచార్జ్ నిఖిల్, రోషన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్

ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యం ● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి తక్ష ణమే చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే మా ప్రధాన లక్ష్య మని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్ర మాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది ఆర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేతో బాధితుల సమస్యల పరిష్కారా నికి చర్యలు చేపడు తున్నట్లు వివరించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి పోలీస్ అధికారులు వినతులు స్వీకరించాల న్నారు. ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాధితుల ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందు పరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు

జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా 25 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రాములును సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘంగా విధులు నిర్వహించి పదవీ వరమణ చేసిన సేవను మరువమని, ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, ఆర్ఐ కిరణ్ కుమార్, ఆర్ఎస్సై సుమన్ తదితరులు ఉన్నారు.

జలగంటకు వేళాయె..




వెల్గటూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతుండడంతో ఎండలు మండుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం చొరవ తీసుకొని పాఠశాలల్లో మళ్లీ జల గంట అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా కంటే ముందు 2018లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ గంటకు ఒకసారి జలగంట మోగించాలని నిర్ణయించింది. ప్రతీ పాఠశాలల్లో జలగంట అమలు చేయడంతో పిల్లల శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. కానీ కరోనా తరువాత జలగంట విషయం మరిచి పోయారు. దీనితో వేసవి కాలం వచ్చిందంటే విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పిల్లల్లో నీటి శాతం తగ్గితే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, సాధ్యమైనంత వరకు తగిన మోతాదులో పిల్లలకు నీటిని అందించాలని వైద్యులు పేర్కొంటున్నారు. కొంత మంది బాల బాలికలు నీరు తాగితే మూత్రం వస్తుందనే భయంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న నీటిని కూడా తాగడం లేదని తెలుస్తోంది. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు సరిగా లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పాషిగామ పాఠశాలలో అమలు

జలగంట ప్రాముఖ్యతను గుర్తించిన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాషిగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ పాఠశాలలో అమలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతీ గంటకు ఒకసారి చిన్నారులు నీటిని తాగేలా ఒక కాల పట్టికను తయారు చేసి గోడపై ప్రదర్శించారు. ఆ సమయం ప్రకారం విద్యా ర్థులు నీటిని తాగేలా చర్యలు చేపట్టారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని విద్యార్థులు గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు చేపడితే వారి ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు.

- వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని నిపుణుల సూచన
- గతంలో పాఠశాలల్లో అమలు
- కరోనా తర్వాత ఆచరణకు నోచుకోని వైనం
- విద్యార్థుల్లో నీరు తగ్గితే ప్రమాదమని వైద్యుల హెచ్చరిక



పాషిగామ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమయ పట్టిక

జలగంట అమలు చేస్తే మేలు..

విద్యార్థులు తగినంత నీటిని తాగకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. బడి ఈడు పిల్లలు వారి వయసు, లింగం, బరువును బట్టి ప్రతీ రోజు ఒక లీటరు నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని తాగాలని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంలో, ఎలక్ట్రో లైట్లను సమతుల్యం చేయడంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. తగిన మోతాదులో ప్రతి నిత్యం నీటిని తాగడం వలన మెదడు పని తీరు కూడా బాగుంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అన్ని విద్యా సంస్థల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా, వడ దెబ్బకు గురి కాకుండా నివారించవచ్చు. రోజంతా కూర్చొని చదవడం కంటే కనీసం గంటకు ఒక సారి ఐదు నిమిషాలు నీటిని తాగడానికి కేటాయిస్తే బాగుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జలగంట మోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీరు తాగడం అలవాటుగా మారాలి

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



ప్రతీ ఒక్కరు రోజూ తగినంత నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా బడి ఈడు పిల్లలు నీటిని తాగడంలో అశ్రద్ధ వహిస్తారు. దీనితో వేసవి కాలం డీ హైడ్రేషన్ వలన చర్మం పొడిబారడం, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వారి వారి వయసు, బరువును బట్టి ఒకటి నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని అందిం చేలా చూడాలి. పాఠశాలల్లో విద్యార్థులకు తగి నంత నీటిని అదించేలా చర్యలు చేపట్టాలి.

జల గంట అమలు చేస్తున్నాం

నీలం సంపత్ కుమార్, పాషిగామ స్కూల్ హెచ్ఎం



పాషిగామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రతీ గంటకు ఒకసారి నీటిని తాగేలా జల గంట అమలు చేస్తున్నాం. ఒక కాల పట్టికను ఏర్పాటు చేసి ఆ సమయం ప్రకారం విద్యార్థులు నీరు తాగేలా చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థుల ఆరోగ్యం కాపాడినట్లు అవుతుంది.

ప్రతి గంటకు నీరు తాగుతున్నాం

భవిష్య వర్మ, పాషిగామ పాఠశాల విద్యార్థిని



మా పాఠశాలలో ప్రతి గంటకు ఒకసారి జలగంట మోగిస్తారు. ఉపాధ్యాయులు కచ్చితంగా ప్రతి గంటకు నీరు తాగాలని మాకు సూచిస్తున్నారు. దీంతో అందరం విద్యార్థులం నీటిని తాగుతున్నాం.

ఏటీఎం కార్డ్ మార్చి రూ.40 వేలు చోరీ

జమ్మికుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి అపరిచిత వ్యక్తి రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్‌ఉద్యోగి సోమవారం ఉదయం ఎస్‌బీఐ ఏటీఎంకు డబ్బుల కోసం వెళ్లాడు. అప్పటికే ఓ అపరిచిత వ్యక్తి సదరు రిటైర్డ్ ఉద్యోగిని అనుసరిస్తున్నాడు. మొదట రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టగా టెక్నికల్ ఎర్రర్ అని వచ్చింది. దీంతో వెనుకాల ఉన్న అపరిచిత వ్యక్తి తాను చూస్తానని ఏటీఎం కార్డు తీసుకున్నాడు. ఉద్యో గికార్డు తనదగ్గర పెట్టుకుని తన దగ్గర ఉన్న కార్డును మిషన్‌లో పెట్టాడు. సిక్రెట్ పిన్‌నంబరు ఎంటర్ చేయాలని ఉద్యోగికి సూచించాడు. పిన్ ఎంటర్ చేయగా రాంగ్‌పిన్ అని వచ్చింది. దీంతో అతను తర్వాత తీసుకుంటానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అపరిచిత వ్యక్తి తనదగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎంకార్డు పెట్టి అప్పటికే తెలుసుకున్న పిన్ నంబరు ఎంటర్‌చేసి రూ.10వేల చొప్పున నాలుగుసార్లు రూ.40వేల కాజేశాడు. సెల్‌ఫోన్‌కు డబ్బులు కట్ అవుతున్నట్లు మేసేజ్ రావడంతో సదరుఉద్యోగి వెంటనే బ్యాంకుకు వెళ్లి ఏటీఎం కార్డు బ్లాక్ చేయించాడు. అనంతరం పోలీస్‌లను ఆశ్రయించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్లాపూర్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులో ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని గోనెల రాజ్‌కుమార్(28) అనే యువకుడు సోమవారం మృతిచెందాడు. మెట్‌పల్లిసీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం మల్లాపూర్ మండలం రాఘవపేటలో బంధువుల ఇంట్లో శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ముత్యంపేట గ్రామ శివారులో చెట్టుకు వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడితండ్రి గోనెల రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు సీఐతెలిపారు. కాగా రాజ్‌కుమార్‌కు 18నెలల క్రితం వివాహం జరిగింది.

లారీ ఢీ కొని మహిళ మృతి

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలో రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేదునూర్ గ్రామానికి లచ్చవ్వ(52) నల్లగొండ గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం ఆటోలో బయలుదేరింది. ఈ క్రమంలో రేణికుంట గ్రామం వద్ద ఆటోను ఆపి కొబ్బరికాయలను కొనేందుకు రోడ్డుకు అవతలివైపునకు వెళ్లింది. కొబ్బరికాయలు కొనుగోలు చేసిన లచ్చవ్వ ఆటో ఎక్కేందుకు వెళుతూ రోడ్డుదాటుతోంది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌వైపు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన లారీ లచ్చవ్వను ఢీకొంది. ఈ సంఘటనలో లచ్చవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లారీ, బైక్ ఢీ: యువకుడి మృతి

అంతర్గాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుందనపల్లి శివారు రాజీవ్ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో సోమవారం బైక్‌పై వెళ్తున్న బండి ప్రసాద్ అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన బండి ప్రసాద్(32) ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై బీ పవర్‌హౌజ్ గడ్డ మీదుగా కుందనపల్లి ఐటీసీఎల్ ఏరియా వైపు వెళ్తుండగా ఎన్‌టీపీసీ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ వెంకటస్వామి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెప్టిక్‌ట్యాంక్‌లో పడి ఒకరి మృతి

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో రాయికల్ పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన సిలివేరి కిరణ్ కుమార్ (54) ఇంట్లో నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం


రాజగంగు (ఫైల్)

కథలాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలకు చెందిన కాసారపు రాజగంగు (50) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం ఎదిగిన కొడుకు ఎలాంటి పని చేయకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బుచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


అనసూర్య (ఫైల్)

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని తాండ్ర్యాల ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద కొద్దిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనసూర్య(55) అనేమహిళ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 1న కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన తోట సంధ్య, ఆమె అత్త అనసూర్య బ్యాంక్‌లో పని ముగించుకుని ఇంటికి వెళ్ళేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నారు. వీరిని బైక్‌తో వేములకుర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న లంక నరేశ్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో అత్తా, కోడళ్లకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనసూర్య మృతి చెందిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాంచంద్రం తెలిపారు.

చోరీ అయిన ట్యాబ్‌ల రికవరీ

మానకొండూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14న రాత్రి 23ట్యాబ్‌లు దొంగతనానికి గురయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ కేసును చేధించారు. సీఐ లక్ష్మీనారాయణ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి పది రోజుల క్రితం ప్రార్థన సమయంలో హెచ్ఎం చూపించిన ట్యాబ్‌లను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. కాగా సదరు విద్యార్థి ఇంటికి వెళ్తున్నానని చెప్పి అదే రోజు రాత్రి 23 ట్యాబ్‌లను దొంగిలించి మండలంలోని కొండపల్కల గ్రామంలోని రాముని గుట్టపై దాచిపెట్టాడు. ట్యాబ్‌లను రికవరీ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. 24గంటల్లో కేసు చేధించడంపై సీపీ గౌస్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాశ్ సీఐని అభినందించారు.


రికవరీ చేసిన ట్యాబ్‌లతో పోలీసులు

వీధి కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రాచర్ల అంజయ్యకు చెందిన గొర్రెల మందపై వీధి కుక్కలు సోమవారం ఉదయం దాడిచేయడంతో 16గొర్రెలు మృతిచెందగా మరో 8 గాయపడ్డాయి. దీంతో మూడులక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. మండల పశు వైద్యాధికారి మనీషాపటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ కాంతయ్య, పంచాయతీ కారోబార్ భూమేశ్వర్ పాల్గొన్నారు.


మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి మనీషాపటేల్

సోషల్ మీడియాలో అశ్లీల పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అశ్లీల పోస్టు పెట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని త్రీటౌన్ పరిధిలోని ఒక వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో అశ్లీల పోస్టు పెట్టాడు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ సైబర్ టిప్‌లైన్ ద్వారా త్రీటౌన్ పోలీసులకు రిపోర్టు వచ్చింది. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల ఆస్తి నష్టం

మల్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన సట్ల లత అనే మహిళ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల నష్టం జరిగింది. ఇంట్లోని బంగారు నగలు, నగదుతో పాటు ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో బాధితులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు మధుసూధన్‌రెడ్డి, సంపత్ సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే ఇంట్లో గల ఫర్నిచర్, రెండు తులాల బంగారు నగలు కాలిపోయాయి.

ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థిని కిందపడిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనకం మేఘన సోమవారం కరీంనగర్‌లో పరీక్షకు హాజరై తిరిగి బస్సులో ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో ముత్తారం గ్రామంలోని మూలమలుపువద్దకు రాగానే డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో బస్సులోనుంచి ఆమె కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోఉన్న ప్యాసింజర్లను వేరేబస్సులో పంపంచి అదేబస్సులో మేఘనను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ శివారులో రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య మొలంగూర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొలంగూర్ పెట్రోల్ బంక్ ఎదురుగా డేనియల్ అనే వ్యక్తి దండు కొంరయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అదే సమయంలో కరీంనగర్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ప్రమాదస్థలం వద్ద తన వాహనాన్ని ఆపి గాయపడిన వారిని పరామర్శించి, డానియల్‌ను తనవాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, కొంరయ్యను 108లోతరలించారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్రవాహనం: ఇద్దరికి గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలకేంద్రంలో ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువతులు గాయపడ్డారు. సిద్దిపేటజిల్లాకు చెందిన నీహారిక, రుచిత ద్విచక్రవాహనంపై వస్తూ తంగళ్లపల్లిలో ఆటోనుఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ సంఘనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో విద్యార్థినికి గాయాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుక్క కాటుతో విద్యార్థిని గాయపడింది. వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామానికి చెందిన గొట్టిముక్కల దేవరాజు, కృపారాణి దంపతుల కూతురు సువర్ణ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది.

సోమవారం సాయంత్రం బహిర్భూమి కోసం పాఠశాల గది నుంచి బయటకు వచ్చి వెళ్లే సమయంలో అప్పటికే గురుకుల పాఠశాలలో ఉన్న కుక్కల గుంపు విద్యార్థినిపై దాడిచేసి గాయపరుస్తుండగా సువర్ణ అరుపులు విన్న విద్యార్థులు అక్కడికి చేరుకుని కుక్కలను చెదరగొట్టారు. కుక్కల దాడితో గాయపడ్డ సువర్ణను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులు, వాచ్‌మన్ నిర్లక్ష్యంవల్లే కుక్కలు పాఠశాలలోకి వచ్చి దాడి చేశాయని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కలదాడిలో గాయపడ్డ సువర్ణను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండం అదిత్య, బీఎస్పీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

నత్తనడకన వాటర్ ట్యాంక్ పనులు



నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు, కొనుగోలు చేసి పక్కన పడవేసిన పైపులు

- అమృత్ పథకం కింద నిధులు మంజూరు
- గత ఏడాది ఆగస్టు 7న శంకుస్థాపన
- పిల్లర్ల దశలోనే పనులు
- ఈ యేడాదీ తప్పని తాగునీటి కష్టాలు

సుల్తానాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అమృత్ 0.2 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.18.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు భావించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఇబ్బందులను తొలగించేందుకు తొమ్మిది నెలల క్రితం నిర్మాణం చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు వేసవిలో ఈ ట్యాంక్ ద్వారా మెరుగైన నీటి సరఫరా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తానాబాద్, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి, శాస్త్రినగర్, పూసాల గ్రామాలు ఉన్నాయి. ఆయా విలీన గ్రామాలలో అప్పటి గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు బిగించి సరఫరా చేస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు ఇటు మిషన్ భగీరథ పథకం నీళ్లుగానీ అటు మానేరు నీరు కానీ పూర్తి స్థాయిలో అందడం లేదు

రెండు రోజులకోసారి సరఫరా

సుల్తానాబాద్ పట్టణంలో ప్రస్తుతం రెండు రోజులకోసారి (డే బై డే) నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పాత కాలం నాటి పైపులైన్ల కారణంగా తరుచూ పైపులైన్లు దెబ్బతింటున్నాయి. సుల్తానాబాద్ పట్టణానికి తాగునీటి సరఫరా వ్యవస్థ ఉన్న గట్టెపల్లి మానేరులోని బావిలో పని చేస్తున్న మోటార్లు తరుచు కాలిపోతున్నాయి. ఈ కారణాలతో నీటి సరఫరాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డే బై డే కూడా నీరు రాని దుస్థితి ఎదురవుతుంది. కాలిపోయిన మోటార్లు, ధ్వంసమైన పైపులైన్ల మరమ్మతు చేయించడంలో ఆలస్యం అవుతున్నందున తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది.

తొమ్మిది నెలల క్రితం శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18.40కోట్ల నిధులతో 14 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను గతేడాది ఆగస్టు 7న ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభించారు. ట్యాంక్ పనులు పిల్లర్ల స్థాయిలో మాత్రమే ఉన్నాయి. పనులు వేగవంతం చేసి ట్యాంక్‌ను ఈ వేసవిలో ఉందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. రోజూ నీటి సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాంక్ పనులు అభివృద్ధిలో ఉన్నాయి

నియాజ్ మున్సిపల్ కమిషనర్



అమృత్ స్కీం ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు అభివృద్ధిలో ఉన్నాయి. వేసవికి ట్యాంక్ అందు బాటులోకి రాకపోవచ్చు. అయినా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో ఎలాంటి ఆటంకం లేకుండా చూ స్తున్నాం. అప్పుడప్పుడు పైప్‌లైన్ల మరమ్మతు వచ్చినా వెంటనే పూర్తి చేయిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సక్రమంగా నీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక పైప్‌లైన్ల కోసం కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. అవి టెండర్ల దశలో ఉన్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం.. రెండునెలల క్రితం 40మందిలబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చాయి. ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం నుంచి వినయ్ అనేవ్యక్తిద్వారా చెక్కు పంపించారు. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్ అనేవ్యక్తి రవి అనేలబ్ధిదారుని పేరుమీదవచ్చిన రూ.60 వేల చెక్కును వినయ్ దగ్గర నుంచి తీసుకున్నాడు. ఇదేగ్రామానికి చెందిన రవి అనే వ్యక్తినికలిసి అతని అకౌంట్‌లో వేశాడు. తమకు సంబంధించిన చెక్కు కాకపోయినప్పటికీ ఇద్దరు కలిసి డబ్బులు పంచుకున్నారు. విషయం వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యేక్యాంపు ఆఫీస్ పీఏ జోలిసాయికృష్ణ ఫిర్యాదు మేరకు డబ్బులను స్వాధీనం చేసుకొని సోమవారం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి జైలు

జగిత్యాలక్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరికి రెండు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పెల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పీట్ల సూరి, కొమిరి నరేష్ ఓబాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగికంగా వేధించారు. దీంతో బాలిక కుటుంబసభ్యులు 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో సూరి, నరేష్‌కు జైలు శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్‌లను ఎస్పీ అభినందించారు.

చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

డిప్యూటీ సీఎంకు సీఐటీయూ నాయకుల వినతి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్లను కేటాయించి వాటిపై అధారపడి పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడం రమణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికు మార్‌లు కోరారు. హైదరాబాద్ లోని అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అర్ధిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్‌తో కలిసి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పవర్‌లూం పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభం వల్ల రాష్ట్రంలో 15 నెలల కాలంలో సరైన ఉపాధి లేక దాదాపు 30 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే షెడ్‌లు పూర్తయిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని కోరారు. మరమగ్గాల కార్మికులకు 2023 సంవత్సరంలో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులు రూ.9 కోట్లు కార్మికులకు అందించాలని కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం తయారు చేయిస్తున్న పొదుపు సంఘాల మహిళలకు అందించే చీరల తయారీలో కార్మికులకు రోజుకు రూ. వెయ్యి వచ్చే విధంగా కూలీ నిర్ణయించాలని కోరారు. సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమలకు సంబంధించి సెస్ సంస్థ విధించిన బ్యాక్ బిల్లింగ్ అదనపు విద్యుత్ చార్జీలు రూ. 30 కోట్లను రద్దు చేయాలని కుటీర పరిశ్రమ అసాములకు 10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్ అందించాలని అదేవిధంగా టెక్స్‌టైల్ పార్కులో విద్యుత్ భారంగా మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలుచేపట్టడంతో పాటు 50 శాతం విద్యుత్ రాయితీ అందించి అన్ని రకాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.



వ్యవసాయంలో కృత్రిమ మేధ

- పంటల్లోచీడపీడల నివారణకు రైతులకు సలహాలు
- మొబైల్ యాప్‌ను రూపొందించిన ఐకార్

చొప్పదండి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలోకి ఏఐ టెక్నాలజీ వచ్చేసింది. మారుమూల ప్రాంతాల్లోని రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానం చేస్తు ఏఐ ఆదారిత యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలు పంటలకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయి. సాంప్రదాయకంగా ఈ ప్రమాదాలను నియంత్రించడానికి రైతులు విచ్చలవిడిగా రసాయనిక పురుగుమందులు ఉపయోగిస్తారు. విపరీతంగా పురుగు మందుల వాడకం వల్ల నష్టాలు ఉన్నాయి. జల, వాయు, భూ కాలుష్యం, పర్యావరణ అసమతుల్యం, జంతువుల్లో, పక్షుల్లో, మనుషుల్లో కలిగే అనారోగ్యాలు, చీడల్లో పురుగు మందుల నిరోధకత పెరుగుతుంది. చీడపీడలు, సమగ్ర పురుగు మందుల వాడకం గురించి రైతులకు సరైన సమాచారం లేకపోవడం వల్ల సస్య రక్షణ సమాచారం కోసం పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ, ఐకార్ (భారత వ్యవసాయ పరిశోదన సంస్థ) నేషనల్ ఫెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) అనే ఏఐ ఆధారిత మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను రూపొందించారు. ఆగస్టు 15, 2024న డిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ యాప్‌ను ఆవిష్కరించగా గత డిసెంబరులో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. రైతుల పొలాల్లో చీడ పీడలను త్వరగా గుర్తించి వాటి నివారణకు సత్వర సలహాలు, సూచనలు అందించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వ భారత వ్యవసాయ శాఖ పరిధిలోని మొక్కల సంరక్షణ తనిఖీ, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో ఈ నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్ఎస్) ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

డౌన్‌లోడ్ ఇలా

ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రైతులు పంట పొలంలో వాడడానికి వీలుగా ఈ యాప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పనిచేస్తుంది. యాప్ ప్రస్తుతం ఆంగ్లం, హిందీ, మరాఠి భాషల్లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం యాప్‌లోని కొన్ని ఫీచర్లు రైతులు, అందుబాటులో ఉన్నాయి. చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, ప్రధాన పంటలకు సంబంధించిన కీటక వ్యాధులను సకాలంలో ఎదుర్కొనేందుకు రైతులు సరైన సలహాలు పొందవచ్చు.

చీడపీడల గుర్తింపు మాడ్యూల్...

ప్రస్తుతం తెగుళ్ల గుర్తింపు మాడ్యూల్ 61 ముఖ్యమైన పంటలకు సంబంధించిన వివిధ చీడపీడలు, తెగుళ్లను గుర్తించగలదు. ఈ మాడ్యూల్‌లో రైతులు నేరుగా మొబైల్ కెమెరా నుంచి ఫొటోను క్యాప్చర్ చేయవచ్చు లేదా ఫోన్ గ్యాలరీ నుంచి అప్‌లోడ్ చేయవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ అప్‌లోడ్ చేసిన ఫోటోలను విశ్లేషించి అందుబాటులో ఉన్న డేటాబేస్‌ను ఉపయోగించి తెగులును గుర్తించి, ఆ తెగులు వల్ల కలిగే లక్షణాలపై సమాచారాన్ని అందిస్తుంది. సమర్ధవంతమైన తెగులు, చీడపీడల నియంత్రణ కోసం ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) పద్ధతులను ఇది సూచిస్తుంది.

మొబైల్ యాప్ విశేషాలు

ఎన్‌పీఎస్ఎస్ ఏఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా రైతులకు పంటల్లో చీడపీడల యాజమాన్యంపై పూర్తి సమాచారాన్ని శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తారు. ఈ యాప్‌లో పురుగుల ఫొటోలను, పంట ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. యాప్ చీడపీడలను, తెగుళ్లను గుర్తిస్తుంది. వెంటనే పిచికారి చేయాల్సిన మందుల వివరాలు, సూచనలు యాప్‌లో కనిపిస్తాయి.

15 రకాల పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, గోధుమ, యాపిల్, అరటి, వంగ, ద్రాక్ష, కంది, మినుము, దానిమ్మ, సోయాబిన్, చెరకు, టమాట పంటల్లో పురు గులు, తెగుళ్ల ఉధృతి సమాచారం రైతులు తెలుసుకోవచ్చు. పంటల్లో పురుగుల ఉధృతికి తగ్గట్టుగా చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫారసు చేస్తుంది.

ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ ద్వారా ఏ వ్యాధి, ఏ కీటకం హానికరం లేదా ప్రయోజనకరమైనది అని తెలుసుకోవచ్చు. దాని క్రిమిసంహారక మందులను, ఏ పరిమా ణంలో, ఏ సమయంలో, ఎంత వాడాలి అనే సమాచారాన్ని పొందవచ్చు. క్రిమిసంహారక మందుల కంటే ముందుగా సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతుల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ మొబైల్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, ఉద్యాన పంటల్లోని పురుగులు, తెగుళ్ల సమగ్ర సమాచారం అందుతుంది.



యాప్ లోగో

ఇంటి వద్దకు భద్రాద్రి రాముడి తలంబ్రాలు



కార్గో సిబ్బంది వద్ద భద్రాచలం తలంబ్రాల కోసం బుక్ చేసుకుంటున్న ఆర్ఎం రాజు

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాముడి తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ఇంటి వద్దకే చేర్చనున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు. సోమవారం కార్గో సిబ్బంది వద్ద భద్రాద్రి రాముడి తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా అక్కడకు వెళ్ల లేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో తలంబ్రాలను ఇంటి వద్దకు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకు ఒక్కో ప్యాకెట్‌కు 151 రూపాయలు ఆన్ లైన్‌లో లేదా బస్టాండ్ కార్గో సెంటర్లు, ఏజెంట్ కౌంటర్ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు.

తలంబ్రాల బుకింగ్ కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కరీంనగర్ ఆర్ఎంఈ	9154298581
కరీంనగర్	9154298562
గోదావరిఖని	9154298554
హుస్నాబాద్	9154298673
హుజూరాబాద్	9154298559
మంథని	9154298554
జగిత్యాల	7780250439
కోరుట్ల	9154298572
మెట్‌పల్లి	9154298574
సిరిసిల్ల	9154298576
వేములవాడ	9154298574



కల్యాణంలో త్రిశూలాలను చూపుతున్న శివపార్వతులు

కల్యాణం.. కమనీయం

- వేములవాడలో శివపార్వతుల కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం సతీమణి మంజుల
- తలాంబ్రాలు పోసుకున్న జోగినులు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాత మామిడి కింద కట్నాలు రాయంగా.. పూత మామిడి కింద పుస్తెలు కట్టంగా.. తల్లిమామిడి కింద తలువాలు పోయంగ.. అష్టాణ కంకణం, నొష్టాన బాసింగంతో.. పక్కన పార్వతి, నెత్తిన గంగమ్మ, రెక్కల శూలాలతో పెద్దలందరూ తరలివచ్చి వేములవాడ పార్వతిరాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం వైభవో పేతంగా, కన్నుల పండువగా నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు నమిలికొండ ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలతో పాటు ధ్వజారోహణ ఘనంగా నిర్వహించారు. వరుడు రాజరాజేశ్వర స్వామి, వధువు పార్వతీ దేవి అమ్మవారిని రాజన్న ఆలయం నుంచి మేళతాళాలతో ఆలయ గెస్ట్‌వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వరుడు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి తరుపున పెళ్లి పెద్దగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, వధువు శ్రీపార్వతిదేవి అమ్మ వారి తరుపున ఆలయ అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. శివుడికి వరకట్నంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రూ. 551 కోట్లు చెల్లిస్తామని అన్నారు. కన్యాదాతలుగా ఈశ్వరగారి సురేష్- నాగలక్ష్మీ దంపతులు వ్యవహరించగా వేదపండితులు అభిజిత్‌లగ్న మూహూర్తమున ఉదయం 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు వేద మంత్రోచ్చరణలతో అత్యంత వైభవో పేతంగా శ్రీస్వామి వారి దివ్యకల్యాణ తంతు జరిపించారు.



పార్వతిపరమేశ్వరులకు తలంబ్రాలు పోస్తున్న కన్యాదాతలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రముఖులు

కల్యాణానికి రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, రాజన్న ఆలయం తరపున ఈవో వినోద్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ తరపున కమిషనర్ అన్వేష్‌లు పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ కార్యలయం నుంచి కమిషనర్‌తో పాటు ఉద్యోగులు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా రాజన్న ఆలయం వరకు తరలివచ్చారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పట్టువస్త్రాలు తలంబ్రాలు తీసుకువచ్చి రూ. 11వేల 121 కట్నంగా చదివించారు.

60 వేలకు పైగా తరలివచ్చిన భక్తజనం

ఆది దంపతుల దివ్య కల్యాణమహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి భక్తులు వేములవాడకు తరలవచ్చి అలయ వసతి గదులతో పాటుగా ఆలయ పరిసరాల్లోని ఖాళీస్థలాల్లో విడిది చేశారు. తెల్లవారు జామునే శ్రీస్వామి వారి కల్యాణం తిలకించేందుకు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ఆవరణ, ప్రాంగాణం ఓం నమఃశివాయ స్మరణతో మారుమోగిపోయింది. రాజన్న ఆలయ ప్రధాన ద్వారం ముందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పట్టణ పురవీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. సుమారుగా 60 వేలకు పైగా భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు.

రాజన్నను మనువాడిన జోగినులు

దక్షిణకాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజన్న కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జోగినులు రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి కల్యాణానికి వచ్చిన ట్రాన్స్‌జెండర్లు, జోగినీలు, శివపార్వతులు తోటి వారికి పుస్తెలు కట్టి తలంబ్రాలు పోసుకుంటూ సాక్షాత్తు పరమ శివుడిని మనువాడినట్లు స్మరించుకున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్ భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్వామి కల్యాణాన్ని నిర్వ హించారు. పెళ్లి పెద్దలుగా ఒడ్నాల శంకరయ్య-సుగుణ, దాసి రవీందర్-జయశ్రీ దంపతులు కల్యాణం జరిపించారు.



తలంబ్రాలు పోసుకుంటున్న జోగినులు

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులోని వేములవాడ అనుబంధ దత్తత ఆలయమైన స్వయంభు నాగ లింగేశ్వర స్వామి ఆల యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుటున్న భక్తురాలు



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, భక్తులకు అన్నదానం, ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో వినోద్‌రెడ్డి

వైభవంగా స్వామి వారి పెద్ద సేవ



నెమలివాహనంపై స్వామి వారల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్ద సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. కల్యాణం అనంతరం రాత్రి 7 గంటల సమయం లో శ్రీస్వామి వారలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలోని జంగమయ్యలు ఆది దంపతుల కల్యాణాన్ని పురష్కరించుకుని వీర భద్రుడి పాటలు పాడుతూ శరభ గజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నెమలి వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ కంబల వెంకటన్న ఉన్నారు.

లక్ష్మీ నృసింహుడి దిగ్యాత్ర



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను పురవీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకువెళ్లి పూజలు చేశారు. రాత్రి స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య, నరసింహ మూర్తి, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి రూ.2, 96,630 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.1,23,014, ప్రసాదాలు విక్రయించగా రూ.1, 42,400 లభించాయి. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ.31,216 ఉన్నట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారల దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి 8 గంటలకు దోపోత్సవం (దోపుకథ) ఉంటుంది. శేషప్ప కళావేదికపై మధ్యాహ్నం తెలంగాణ సాంస్కృతిక సారథులచే జానపద, భక్తి, సంగీతం, నృత్యాలు, గడ్డం రమేష్‌చే భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి కరీంనగర్‌కు చెందిన శశికళ బృందంచే భక్తి సంగీతం ఉంటుంది. అనంతరం ఆలయ అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్‌చే దోపుకథ ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

రెండో రోజు కొనసాగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

సెమిఫైనల్స్‌కు చేరుకున్న కరీంనగర్, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జట్లు

హుజూరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలు సోమవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కరీంనగర్ వర్సెస్ మెదక్, హైదరాబాద్ వర్సెస్ నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం 7గంటలకు సెమీ ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీ సర్ధార్ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, సీనియర్ క్రీడాకారులు పవన్‌కుమార్, శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, సురేష్, తిరుపతి, రవికుమార్, శ్యాంసుందర్, సజ్జు, సాయికృష్ణ, రాజేష్, విక్రమ్, సాంబ, కరీంనగర్ జిల్లా జట్టు కోచ్ రాజేష్, మేనేజర్ వినయ్ పాల్గొన్నారు.

- **మ్యాచ్‌ల వివరాలు..**

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ గ్రూప్-ఏలో ఖమ్మంపై వరంగల్ 9-1, రంగారెడ్డిపై హైదరాబాద్ 4-3, వరంగల్‌పై కరీంనగర్ 1-0, ఖమ్మంపై రంగారెడ్డి 1-0విజయం సాధించాయి. గ్రూప్-బీలో నల్గొండపై మహబూబ్‌నగర్ 16-2, ఆదిలాబాద్‌పై నిజామాబాద్ 2-0, మెదక్ పై మహబూబ్‌నగర్ 3-1, నల్గొండపై నిజామాబాద్ 12-2, ఆదిలాబాద్‌పై మెదక్ తలపడగా చెరొక రెండు గోల్స్ వేసి డ్రాగా ముగిసింది.

ఇసుక టిప్పర్ పట్టివేత

కథలాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరు పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం టిప్పర్‌ను పట్టుకుంది. టీఎస్ 12 యుపి 4893 నంబర్ గల టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నట్టు టీం సభ్యులకు సమాచారం రావడంతో దాడులు చేసి పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న టిప్పర్ యజమాని మామిడి మహిపాల్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. పట్టుకున్న టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పాస్టర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల పాస్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా దూలూరి ప్రసాద్ ఎన్నికయ్యారు. మండలంలోని బీసస్ నూతన జెరూషలెం చర్చిలో నిర్వహించిన పాస్టర్స్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నిగ హనోక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు జయశీలమ్మ, బర్నాబాస్, ఏలీయాజరు, సంతోష్, దేవయ్య, డేనియల్, రాజేష్, డేవిడ్, యోనా, ఎజ్రా, ఎబినేజరు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కథలాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధూజ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మోడల్ స్కూళ్ళకు సంబంధించిన హాస్టల్ విద్యార్థినిలకు సోమవారం వైద్యాధికారిణి సింధూజ వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణ, హెచ్ఈఓ శ్రీధర్, ప్రిన్సిపాల్ లావణ్య ఉన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్‌డే

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్ పరీక్ష ప్యాడ్‌లతో పాటు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మెంతుల వెంకటరమణి, మాజీ సర్పంచ్ జక్కుల ప్రసాద్, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, శంకరయ్య, మహేష్, వంశీధర్ రావు, సురేష్, వేణు, సంజీవ్, హుస్సేన్, కమురుద్దీన్, పుష్పలత, భవానీ, సరోజిని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రజావాణి

మల్యాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి పలు శాఖల అధికారులు గైర్హాజరు అవుతున్నారు. సోమవారం ప్రజావాణికి ఎంపీడీవో, ఏవో, ఎంపీవో, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరు అయ్యారు. కలెక్టర్ తగు చర్యలు తీసుకొని అధికారులు పూర్తి స్థాయిలో హాజరు అవడంతో పాటు సమస్యల పరిష్కారం అయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- ప్రజల నుంచి 35 దరఖాస్తులు స్వీకరణ -కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వివిధ సమస్యలతో వచ్చిన బాధితులు తమ దరఖాస్తులను ఇచ్చారు. ప్రధానంగా ఎక్కువ దరఖాస్తులు భూ సమస్యకు సంబంధించిన వచ్చాయి. తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని కొందరు, పిల్లలు పోషించడం లేదని కొందరు దరఖాస్తులు ఇచ్చారు. ప్రజావాణిలో 35 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కొడుకు తిండి పెట్టడం లేదు..
-చెట్టి మల్లమ్మ, జగిత్యాల

నా కొడుకు నన్ను ఇంటికి రానివ్వడం లేదు. తిండి పెట్టడం లేదు. ఇంటి బయటనే మంచం వేసి అక్కడే ఉండమని అంటున్నాడు. నాకు చెవులు సరిగా వినరావు. నడవడానికి కూడా ఓపిక లేదు. ఉన్న నాలుగున్నర ఎకరాల భూమిని కొడుకు తన పేరుపై చేయించుకున్నాడు. ఇప్పుడు అన్నం పెట్టమంటే బయటకు గెంటేశాడు. ఎలాగైనా నా కొడుకును ఒప్పించి నన్ను ఇంట్లో ఉంచుకుని పోషించేలా చర్యలు తీసుకోండి.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి
-జిల్లా రైతు వేదిక నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ఇప్పటివరకు 30 శాతం వరకే అయింది. ఇంకా 70 శాతం రైతులకు రుణమాఫీ కాలేదు. రైతుబంధు కూడా కొంత మందికే వచ్చింది. అనేక మందికి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అసెంబ్లీ ముగిసేలోపు రైతులందరికీ రుణమాఫీ చేయడంతో పాటు రైతుబంధు అందజేయాలి. రైతుల వివరాలు పూర్తి స్థాయిలో మండల స్థాయి వ్యవసాయ అధికారి వద్ద ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి..
-బీజేపీ నాయకులు

జగిత్యాల మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో కొంత మంది ఆక్రమించుకున్న వంద ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాలి. రెవెన్యూ అధికారులతో ధరణిలో నమోదు చేయించుకుని సంవత్సరాలుగా రైతుబంధు తీసుకుంటున్న వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. అలాగే అక్రమంగా ఆ భూముల్లో ఉన్న ఇటుక బట్టీలను బంద్ చేయించాలి.

విలువలతో కూడిన వ్యక్తిత్వమే విజయానికి మూలం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన వ్యక్తిత్వమే విజయానికి మూలమని ప్రముఖ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ నిపుణులు డా. శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ నిర్మాణంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శిక్షకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మన మైండ్ సెట్ మార్చుకోవడం ద్వారా ఆశావాహ ఫలితాలు సాధించవచ్చన్నారు. అన్నింటిలో మంచి చెడులు ఉంటాయన్నారు. మనం ఎంచుకునే సరైన మార్గం వల్ల ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. అనంతరం స్కిల్ నాలెడ్జ్ సెంటర్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐఫోన్ ఉత్పత్తి కేంద్రంలో పని చేయుటకు శ్వాన్ బిజినెస్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన వారికి జాబ్ ఆఫర్ లెటర్లను అందించారు. మొత్తం 53మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరవగా 28 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'



మల్యాలలో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చట్టబద్ధత కల్పించి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో నలువాల సంజీవ్, మోత్కుల నర్సయ్య, ముప్పారపు రవి, నక్క రాజయ్య, బెజ్జంకి నర్సయ్య, సురేశ్ పాల్గొన్నారు

●**గొల్లపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ఆ తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ముల్కల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తు గొల్లపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహదీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో వర్గీకరణ చేపట్టి తీరాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు చెవులమద్ది రమేష్, ఓరుగంటి జాన్, కాంపల్లి హనుమాండ్లు, తాండ్ర రాజన్న, రాపెల్లి అర్జున్, రఘు, లక్ష్మణ్, గంగవ్వ, గంగాధర్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ ఉద్యోగులకు సోమవారం డిపో మేనేజర్ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఉద్యోగులు ఎండాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సూపర్‌వైజర్ లక్ష్మయ్య, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ సాదిక్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ గంగారాం, హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

మెట్‌పల్లిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ధ్యాన కేంద్ర నిర్వాహకులు తోట హరి ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి గార్డెన్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, రామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో ధ్యానోత్సవం సందర్భంగా ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహించారు. ధ్యానం చేయడం వల్ల కలిగే లాభలను ప్రజలకు వివరించారు. ధాన్యంతో మానసిక ప్రశాంతత, స్పష్టత, ధైర్యం, ఏర్పడుతుందన్నారు. హృదయంలో ప్రేమ ద్వార అన్ని కణల రక్త ప్రసరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల కృష్ణ, మైలారపు లింబాద్రి, పడిగెల శ్రీనివాస్, ఏలేటి నరేందర్ దొంతుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సోమవారం కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న సేవాభారతి అధ్యక్షుడు రాజమల్లయ్య

మెట్‌పల్లి రూరల్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని సేవా భారతి అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ గాజంగి రాజమల్లయ్య, హోమియోపతి వైద్యురాలు పరిమళ అన్నారు. వేంపేట ప్రభుత్వ పాఠశాలలోని పదో తర గతి విద్యార్థులకు సేవా భారతి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగరాజకుమారి పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

సారంగాపూర్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేచపల్లి ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మాజీ వార్డు మెంబర్ బేర మహేష్, మిత్ర బృందం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూరెల్ల శ్రీనివాస్, గుజ్జేటి మల్లేష్, లెక్కల శేఖర్, బుర్ర సతీష్ గౌడ్, బాస మల్లన్న, , ప్రధానోపాధ్యాయులు భోగ మధుసుధన్ పాల్గొన్నారు.

●కొడిమ్యాల, మార్చి17(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ పరీక్ష ప్యాడ్లను, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి అవార్డు

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సర్ సివి రామన్ అకాడమి సేవా సాంస్కృతిక సంస్థ రాష్ట్ర స్థాయిలో అందించే గోల్డ్‌మెడల్, అవార్డును జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి అందుకున్నారు. సర్ సివి రామన్ రుద్రాక్ష వైభవం, అధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో 33వ సంవత్సర ఉగాది మహోత్సవ సువర్ణ ఘంటా కంకణ, గోల్డ్ మెడల్, అవార్డును సికింద్రాబాద్‌లోని ఎస్‌పీ రోడ్‌లో గల హరిహర కళాభవన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును లింబాద్రి స్వీకరించారు. సంస్థ నిర్వాహకులచే 'సేవ వైభవ మహారాజ్' అవార్డును, గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. లింబాద్రిని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు, రా రైస్ మిల్లర్లు అభినందించారు.

మామిడి మార్కెట్ అధ్యక్షుడిగా అమినొద్దీన్

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి కమిషన్ ఏజెంట్స్ సంఘ అధ్యక్షుడిగా వ్యాపారి అమినొద్దీన్ ఎన్నికయ్యారు. సోమవారం కమిటీ ఎన్నికపై సమావేశం నిర్వహించగా 80మంది సభ్యులు హాజరై ఏకగ్రీవంగా మహ్మద్ అమీనొద్దీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అమి నొద్దీన్ మాట్లాడుతూ మామిడి మార్కెట్‌లో అభివృద్ధి పనులు, ఇతర మౌలిక వసతుల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాథమిక పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్

బీర్‌పూర్,మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, మాజీ ఎంపీపీ రమేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ మూర్తి, సీఆర్‌పీ సురేష్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా కొండూరి రాజేష్

మెట్‌పల్లిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షునిగా కొండూరి రాజేష్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నాట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షునిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా జిల్లా నవీన్, కార్యదర్శిగా కొటగిరి రవి, కోశాధికారిగా ముక్క నరేష్‌లు నియామకమైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన బయో వేస్టేజీ

-ఆసుపత్రికి రూ.5వేల జరిమానా

జగిత్యాల అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల బైపాస్ రోడ్డులో గల జంబిగద్దె సమీపంలోని ప్రముఖ కిడ్నీకేర్ ఆస్పత్రిలో వాడిన గ్లూకోజ్ బాటిళ్లు, వాడిన సిరంజీలు, ఇతరత్రా బయో వేస్టేజీని రోడ్డుపై పారవేయడంతో మున్సిపల్ అధికారులు రూ.5వేల జరిమానా విధించారు. బయో వేస్టేజ్ రోడ్డుపైన వేస్తే కఠిన శిక్షలు ఉంటాయని తెలిసినప్పటికీ ఆస్పత్రి యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మున్సిపల్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆసుపత్రులు రోడ్డుపై బయో వేస్ట్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి చేయూత

మల్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో మల్యాల మండల కేంద్రానికి చెందిన లత అనే మహిళ ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించి రూ.3లక్షల విలువైన సొత్తు దగ్ధం కాగా ఆమె కుటుంబానికి సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.5వేల నగదు పంపించగా ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్‌గౌడ్ అందించారు. మల్యాలకు చెందిన మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కోరెపు వెంకటేష్, రత్త కిషన్, శనిగారపు తిరుపతి, కట్కం వినయ్, కీసరి సాయిచందు, గంగాధర్, వరన్, శ్రీనివాస్, బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. భీష్మ యూత్, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూ.5వేల నగదు అందజేశారు.

టీజీపీఎస్సీ ఫలితాల్లో 'కావ్య' ప్రతిభ

-సూపరింటెండెంట్‌గా ఎంపిక



ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో ధర్మపురి పట్టణానికి చెందిన కోయల్‌కార్ కావ్య ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చిల్డ్రన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా బాసర జోన్ (జోన్2)లో ఉద్యోగానికి ఎంపికైంది. కావ్య ప్రస్తుతం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని సోషల్ వెల్ఫేర్ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికైన రాయికల్ యువకుడు

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీఎస్సీ ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో పట్టణానికి చెందిన కల్లెడ రాజ్ కుమార్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాజ్ కుమార్‌ను గంగపుత్ర సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

అయ్యప్ప ఆలయ కమిటీ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకులు కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సోమవారం 29వ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షులుగా గంగుల వివేక్, అధ్యక్షుడిగా దొమ్మటి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా అంకతి భరత్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

కార్యదర్శిగా చిలమంతుల శివ, కోశాధికారిగా బండారి మారుతి, కార్యవర్గ సభ్యులుగా బుర్ర ప్రసాద్‌గౌడ్, అవుట్ల లక్ష్మణ్, నరేష్‌లను ఎకగ్రీవంగా ఎనుకున్నాట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు

మల్యాల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మల్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు అన్ని వసతులు కల్పిస్తూ ఏఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరీశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మార్కెట్ కార్యలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో యార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి వరలక్ష్మీ, సూపర్‌వైజర్ శ్రీదేవి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎండపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని సీఐ కె.ప్రవీణ్ కుమార్ అన్నారు. బసంత్‌నగర్ పరిధిలోని ముంజంపల్లి గ్రామంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులు కనబడిన 100 సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

పెగడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రతి సోమవారం పల్లకీ సేవ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపకల్పన చేయగా కమిటీ చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పల్లకీ మోసి సేవలో తరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, మూల వెంకట్ రెడ్డి, కిషన్ రావు, రాంచంద్రం, శేఖర్, శ్రీనివాస్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏకవాక్యంతో అవమానించినందుకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, దళిత నేత బలిజ రాజరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతున్న కాంగ్రెస్ సర్కారుపై అక్కసు వెళ్ళగక్కడం దారుణమని ఆరోపించారు. స్పీకర్‌ను అవమానించడం యావత్ దళిత జాతికి జరిగిన అవమానంగా భావిస్తున్నామన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్స్ సోమవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆశావర్కర్స్ తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకున్నారు. గేటు ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్స్‌కు ప్రభుత్వం రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం మండల సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యశోద, సత్యగంగ, కళ్యాణి, స్వప్న, మాధవి, సరిత, లావణ్య, జ్యోతి, ప్రభ, రమ, లక్ష్మి, మౌనిక, గీత, జ్యోతి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం'

మెట్‌పల్లి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందని పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని చెరువు కట్ట మరమ్మతుల పనులకు రూ. 19లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు, జగ్గసాగర్ గ్రామంలోని ముదిరాజ్ సంఘ భవనానికి రూ.3లక్షలు, ఒడ్డెర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.9లక్షలతో చేపట్టే పనులకు స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం రామలచ్చక్కపేట గ్రామంలో గజ్జేల గణేష్‌కు రూ.60వేలు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేసి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ జుంబార్తి కాసీం, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, పిడుగు తిరుపతి రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగాధర్, గణేష్, రవి, రాజారెడ్డి, దిలిప్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, జీవన్, భూమారెడ్డి, సుమాన్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో సోమవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, మాజీ ధర్మకర్త గునిశెట్టి రవీందర్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్య తీసుకోవాలి

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టి అవమానించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎన్ఎస్‌యుఐ నాయకులు ఎస్సై రాంచంద్రంకు ఫిర్యాదు చేశారు. నకిలీ వీడియోలు సృష్టించి సీఎంను అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరుకూరి విజయ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్ ఉన్నారు.

మామిడి తోటలకు అధిక తడులు అందించాలి

సారంగాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో మామిడి తోటల్లో పిందే రాలడం నివారించడానికి అధిక నీటి తడులను అందించాలని హార్టికల్చర్ శాఖ ప్రతినిధి రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మంటలతో కాలిపోయిన చెట్లను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏఈవో వెంకటేష్, కొండ్ర రాంచందర్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సారంగాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తేలు రాజు అన్నారు. రేచపల్లి, లచ్చనాయక్ తండా, మ్యాడారం తండా, బీంరెడ్డి గూడెం, గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ నూతన సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాగి సత్యంరావు, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, ఒడ్నాల జగన్, శాతల్ల రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వేద సదస్సు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బహ్మోత్సవాల్లో భాగంగా ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళావేదికపై కొరిడె నరహరి, జ్యోతి శాస్త్రీయ సంగీతం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో భోగ మండపం, వేదసదస్సు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో అనేక మంది పండితులు వేదాలు పఠించారు. కార్యక్రమాలను పలు వురు భక్తులు తిలకించారు.